**మా ఇంటి దగ్గరున్న స్కూల్‌లో నాలుగో తరగతి వరకే ఉండేది. మిడిల్ స్కూల్‌కు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం. నన్ను తొందరగా బడిలో వేసిన ఫలితంగా.. ఎనిమిదేళ్లకే ఆ స్కూల్‌కు నడిచి వెళ్లాల్సి వచ్చేది. పుస్తకాలు, నోట్‌బుక్స్, టిఫిన్ బాక్సు.. వీటన్నిటితో సంచీ బరువుగా ఉండేది. దాన్ని మోసుకుంటూ రెండు కిలోమీటర్లు నడవాలంటే.. ప్రాణం నెత్తిమీదికొచ్చేది.**

# సైకిల్ స్టోరీ



సినిమాల్లో ఇలాంటి కష్టాలొచ్చినప్పుడు చిన్నపిల్లలు కూడా పెద్ద గొంతులేసుకుని పాటలు పాడటం.. వెంటనే దేవుడు ఓ ముసలమ్మ/ ముసలయ్య రూపంలోనో, కోతి రూపంలోనో, పక్షి రూపంలోనో వచ్చి కావాల్సిన సహాయం చేసి మాయమవడం నాకు గుర్తుంది. అందుకని నేను ఆ విద్యను ఉపయోగించి.. ''దేవా! చూస్తున్నావా పొంచి పొంచి.. ఆ అందమైన ఆకాశము నుంచి.. మోయలేకున్నాను ఈ బరువు సంచి.. కాపాడవా నువ్వు వేగమే అరుదెంచి..'' అంటూ, అంత్యప్రాసలతో పాడుకునేదాన్ని. ఆయాసం వచ్చేది గానీ, దేవుడొచ్చేవాడు కాడు.

అయితే అప్పుడప్పుడూ వెంకట్రాం నర్సయ్య అనే ఆర్‌ఎంపీ డాక్టర్.. దేవదూతలా రథం మీద కాకుండా సైకిల్ మీద ఆ దారిన వెళ్తూ, నన్ను చూడగానే ఆపి.. ''అమ్మాయీ! అయ్యో.. ఎంత తిప్పలు పడుతున్నరు?! నాయిననను ఒక్క సైకిల్ కొనియ్యమనక పోయిన్రు!'' అంటూ ఎంతో జాలిపడేవాడు. ఆయనను మేము 'నారా' అని పిలిచేవాళ్లం ఎందుకో! పరామర్శతో ఆపకుండా.. నా పుస్తకాల సంచీని సైకిల్ వెనక క్యారెల్‌కు బిగించి, నన్ను సీట్ ముందున్న రాడ్‌మీద ఓ పక్కగా కూర్చోబెట్టుకునేవాడు. అక్కను కూడా వెనుక కూర్చోబెట్టుకుందామంటే కుదిరేది కాదు. పైగా.. ''ఏమొద్దు! నేను నడిచే ఒస్తా!'' అనేది అక్క. ఆ సైకిలు రయ్యిమని వేగంగా వెళ్తుంటే.. నాకు ఎంత ఆనందంగా ఉండేదో చెప్పలేను. బడి దగ్గర సైకిల్ మీద నుంచి దిగి వెళ్తుంటే మా స్నేహితురాళ్లు.. ''సైకిల్ మీదొచ్చినవానబ్బా !'' అంటూంటే, గొప్పగా ఫీల్ అయి.. ''అవునబ్బా!'' అని జవాబిచ్చేదాన్ని. ఇటీవలే 'నారా' చనిపోయాడని తెలిసి ఎంతో బాధ కలిగింది.

నేను హైస్కూల్‌కి వచ్చాక మా సీనియర్స్‌లో ఒకరిద్దరు అమ్మాయిలు సైకిల్ తొక్కుతూ బడికి రావడం గమనించాను. ఆ సైకిల్ ఒక గుర్రం లాగానూ, దానిపై కూర్చున్న అమ్మాయి కత్తిలేని రాణి రుద్రమ లాగానూ నాకు కనిపించేవారు. 'దీన్ని మాత్రం ఎందుకు వదిలిపెట్టాలి?! ఎలాగైనా నేనూ సైకిల్ నేర్చుకుని తొక్కాలి' అని రోజుకు పదిసార్లయినా మనసులోనే శపథం చేసుకున్నాను. అప్పుడే మా ఊరి థియేటర్‌లో 'మంగమ్మ శపథం' సెకండ్ రన్‌లో చూశాను మరి!

''నానా! ఒక సైకిల్ కొనియ్యవా! బడికి పోవుడు కష్టమైతున్నది'' అని నాన్నను వీలైనంత గారాబంగా అడిగాను.

''గిప్పుడు సైకిల్ ఎందుకు?! నడిచి పోతెనే ఆరోగ్యం! రోడ్డు మీద బస్సులు, లారీలు ఒస్తయి. నడుపరాక దేనికన్న టక్కర్ పెడితె ఎట్ల?! అయినా నువ్వు మొదలు సైకిల్ నేర్చుకో.. చూద్దాం'' అన్నాడు నాన్న. దాంతో నా రాణిరుద్రమ కలపై బిందెడు నీళ్లు దిమ్మరించినట్లయింది.

అప్పట్లో సైకిల్స్ కొంచెం హార్డ్‌గా, బరువు ఎక్కువగా ఉండేవి. ముందు రాడ్ లేకుండా, ఆడపిల్లలు తొక్కే అందమైన సైకిళ్లు నాకు అప్పటికి తెలియవు. తరువాత హైదరాబాద్‌లో చూశాను. నాన్న దగ్గరికి పొలాలు, ఇళ్ల స్థలాల రాతకోతల కోసమో, ఏదైనా సలహా కోసమో ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూ ఉండేవారు. వాళ్లల్లో కొందరు సైకిళ్ల మీద వచ్చి.. మా ఇంటి ముందు వేప చెట్టు మానుకో, దాని నీడలోని గోడకో వాటిని ఆనించి ఉంచేవారు. సైకిళ్లను ఎవరూ ఎత్తుకుపోరు గనుక.. తాళం వేసే అలవాటు ఉండేది కాదు. చాలా సైకిళ్లకు స్టాండ్ కూడా ఉండేది కాదు.

ఇక నేను కార్యాచరణ మొదలుపెట్టాను. సెలవు రోజుల్లో మా నాన్న దగ్గరికి ఎవరైనా సైకిల్ మీద వచ్చారంటే చాలు.. ఆ సైకిల్ తీసుకుని మా వీధుల్లోనే ప్రాక్టీస్‌కు వెళ్లేదాన్ని. అందులో కూడా ముసలి సైకిళ్లు నాకు నచ్చేవి కావు. కొంచెం కొత్తగా ఉన్నదాన్నే పట్టుకుపోయేదాన్ని. నా ఎత్తు సరిపోక సైకిల్ ఎక్కరాకుండా ఉండేది.

అందుకని ఓ ఎత్తయిన అరుగో, రాయో చూసుకుని.. అక్కడ సైకిల్ పెట్టి ఎక్కేదాన్ని. ఇంకా మా రామస్వామి సార్ బిడ్డ వనజలాగా 'కయించీ' తొక్కడం ప్రాక్టీస్ చేశాను. కయించీ అంటే మరేం లేదు.. సీట్ మీద కూర్చోకుండా దాని కింద నుంచి కుడి కాలిపాదం అవతల పెడల్ మీద పెట్టి, ఎడమ కాలుపాదం ఇవతలి పెడల్ మీదుంచి, మోచేయి సీట్ మీద ఆనించి రెండు చేతులతోనూ హ్యాండిల్ పట్టుకుని తొక్కడం! ఒక్కోసారి బ్యాలెన్స్ తప్పి ఘోరంగా పడిపోయేదాన్ని. ఎవరైనా చూస్తే మా నాన్నకు చెబుతారేమోనని భయంగా ఉండేది. అందుకనే తొందరగా లేచి ఎవరూ చూడక ముందే సైకిల్‌ను నెట్టుకుంటూ ఇంటికి పరిగెత్తేదాన్ని. మోకాళ్లు, మోచేతులు గీరుకు పోయినా.. ఇంట్లో ఎవరికీ చెప్పేదాన్ని కాదు.

ఓసారి అలాగే ఇంటికి వచ్చేసరికి నాన్న, ఆ వచ్చిన ఆయన ఇంటి ముందు నిలబడి సైకిల్ కోసం చూస్తున్నారు. నాన్న కళ్లల్లో కోపం కన్పించి సైకిల్ అక్కడ పెట్టి లోపలికి పరిగెత్తాను. నాన్న ఏదో చెప్పబోతుంటే ఆయనే.. ''అయ్యో! ఏమైతది. చిన్న అమ్మాయి కదా! శానమంది పిల్లలు గిట్లనే సైకిల్ నేర్చుకుంటరు'' అని వెళ్లిపోయాడు. ఇక ఆరోజు ఇతరుల వస్తువులు వారి అనుమతి లేకుండా తీసుకోవడం, వాడటం ఎంత నేరమో చెబుతూ నాకు సుమతి, వేమన శతకాలు, భర్తృహరి సుభాషితాలు కలిపి ఒక క్లాసు తీసుకున్నారు అమ్మా నాన్నా.

మా చిన్నప్పుడు పల్లెటూర్లకు రవాణా సౌకర్యాలు అంతలా ఉండేవి కావు. ఓ మాదిరి పెద్ద ఊర్లలో సైకిల్ సెంటర్లు ఉండేవి. 'ఇచ్చట సైకిళ్లు కిరాయికి ఇవ్వబడును' అని గోడ మీద బొగ్గుతో అడ్డందిడ్డంగా పెద్ద అక్షరాలతో రాసి ఉండేది. టౌన్‌లో బస్సు గానీ, రైలు గానీ దిగిన వాళ్లు ఆ సైకిల్ బాడుగకు తీసుకుని.. వాళ్లు వెళ్లాల్సిన ఊరికి వెళ్లేవాళ్లు. తిరిగి సైకిల్ అప్పగించేటప్పుడు ఎన్ని రోజులైతే అన్ని రోజులకు రోజుకింత అని కిరాయి ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పట్లా ఆధార్ కార్డుల్లాంటివి లేవు గనుక.. ఎవరైనా తెలిసిన వాళ్ల రెకమెండేషనో లేక షాపు వాడి దగ్గర రిస్టువాచీ పెట్టడమో చేసి సైకిల్ తీసుకు వెళ్లాల్సి వచ్చేది. సైకిల్ బాగా తొక్కే మనిషికి ఒక పెద్ద డిగ్రీ ఉన్నట్టు విలువ ఉండేది. చావు వార్తలు వేగంగా తెలియాలన్నా ఓ మనిషిని సైకిల్ మీదే పంపేవారు. చుట్టాల దగ్గరినుంచి సైకిలు మీద మనిషి వచ్చాడంటే చావు వార్తేనని భయపడేవారు. సంచీలోంచి కొబ్బరి కుడుకలు తీశాడంటే శుభ వర్తమానం అన్నమాట.

నేను సైకిల్ కొనకుండానే తొక్కడం నేర్చుకున్నాను. కొన్నేళ్ల తరువాత మా పిల్లలకు స్కూల్‌కు వెళ్లడానికి సైకిళ్లు కొన్నాక.. అప్పుడప్పుడూ ఆ సైకిల్ తొక్కి సంతోషపడేదాన్ని. ఆ తరువాతి రోజుల్లో మోపెడ్ స్కూటీ నడిపినా, కారు డ్రైవింగ్ నేర్చుకుని ఇప్పటికీ కారు నడుపుతున్నా.. సైకిల్ మీద ఇష్టం అలాగే ఉండిపోయింది. ■



**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**